కౌలు రైతులకు 'భరోసా'..!

- వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం నిర్ణయం
- వివరాలు సేకరిస్తున్న అధికారులు

'వ్యవసాయం చేసే వారికే రైతు భరోసా ఇస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి కౌలు రైతులకు రైతు భరోసాను అందిస్తాం. ఇందుకోసం అధికారులు కౌలు రైతులు క్షేత్ర స్థాయిలో గుర్తిస్తారు. కౌలు రైతులను అన్ని విధానాలుగా ఆదుకుంటాం'
- ఇటీవల వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్న మాటలివి



బోథ్: కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు కౌలు రైతుల గుర్తింపు కోసం ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులకు మౌఖిక ఆదేశాలను జారీ చేశారు. వానాకాలం సీజన్ నుంచే కౌలు రైతులకు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో వ్యవసాయ శాఖ అధికారులు లెక్కలు తీసే పనిలో పడ్డారు. రాష్ట్రంలోనే అత్యధికంగా అదిలాబాద్ జిల్లాలోనే సుమారు లక్షకు పైగా కౌలు రైతులున్నారు. వీరు దాదాపు లక్ష ఎకరాలకు పైగా విస్తీర్ణంలో భూములు కౌలుకు తీసుకొని పత్తి, సోయా, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు కేవలం భూమి ఉన్న రైతులకే వర్తించింది. కౌలుదారులకు ప్రభుత్వ పరంగా ఎలాంటి ఆర్థిక సాయం అందించలేదు. చాలా మంది పంట నష్టపోయి, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి.

అప్పుల ఊబిలో..

తెలంగాణ ఏర్పడక ముందు కౌలు రైతులకు అప్పటి ప్రభుత్వాలు కౌలు కార్డులు అందజేయగా.. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తరువాత నుంచి వీరికి సర్కారు ద్వారా ఎలాంటి ప్రయోజనాలు అందలేదు. కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నా.. వారికి ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలూ అందించలేదు. దీనికి కారణం కౌలు రైతులను గుర్తించడంలో పలు ఇబ్బందులు ఏర్పడ్డాయి. జిల్లాలో రైతులు 40 శాతం మంది కౌలు రైతులేనని పలు కమిటీల నివేదిక గతంలోనే వెల్లడించాయి. ఏటా సీజన్ ప్రారంభంలో పంట పెట్టు బడులకు కౌలు రైతులు ప్రైవేటు వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు. అధిక వడ్డీకి తీసుకువచ్చి, పంట నష్ట పోతే ఆర్థికంగా చితికిపోతున్నారు. ప్రైవేటు అప్పులతో పండిన పంటను తిరిగి దళారులకే అమ్ముకోవాల్సి రావడంతో అప్పుల ఊబిలో చిక్కుంటున్నారు.

వివరాల సేకరణ..

కౌలు రైతులు ఎంత మంది అనే వివరాలు సేకరించాలని మౌఖికంగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది. ప్రభుత్వం కౌలు రైతులకు ఆర్థిక సాయంపై ప్రకటన చేయడం, తాజాగా సీజన్ సైతం ప్రారంభం కావడంతో జిల్లాల్లో కౌలు రైతుల సంఖ్య సేకరణపై వ్యవసాయ శాఖ దృష్టి సారించింది. జిల్లా వ్యాప్తంగా ఎన్ని ఎకరాల్లో కౌలు రైతులు ఏయే పంటలు సాగు చేస్తున్నారనే వివరాలను అధికారులు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చిన వెంటనే వీటిని ప్రభుత్వానికి నివేదించడానికి సన్నద్ధమవుతున్నారు.

అన్ని పథకాలు అందించాలి



కౌలు రైతులకు ప్రభుత్వ ప్రవేశపెడుతున్న అన్ని పథకాలను వర్తింపజేయాలి. కౌలు రైతులకు రైతు భరోసా కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొంది. ఇందుకోసం కౌలు రైతుల వివరాల సేకరణ త్వరగా చేపట్టాలి. రైతు భరోసా అందించాలి. వారికి కార్డులను జారీ చేసి బ్యాంకులో రుణాలు ఇవ్వాలి.

- సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు

వీఆర్ఏ వారసులకు న్యాయం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇచ్చోడ: గతంలో తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 81, 85 ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందించి, న్యాయం చేయాలని వీఆర్ఏ వారసుల సంఘం జిల్లా నాయకులు దొనిపెల్లి రమేశ్ కోరారు. బుధవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సత్యానారాయణకు అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జీవో జారీ చేసినా.. ప్రసుత ప్రభుత్వం అమలు చేయడం లేద న్నారు. దీంతో వీఆర్ఏ వారసులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. సంఘం నాయకులు దినేష్, జహీర్, రాగోభా, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: విద్యార్థులు లక్ష్యంతో చదివి, జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకునే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇచ్చోడ డిగ్రీ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని, ఇక్కడి ప్రాంత విద్యార్థులు కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేట్‌కు దీటుగా విద్య బోధన సాగుతుందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యం అలరించింది. కార్యక్రమంలో గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రావు, మాజీ సర్పంచ్ సునీత, రాథోడ్ మౌనిక, ఎట్టం రాములు, గోపి రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి కష్టపడి చదవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్: ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి, ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్ అన్నారు. బుధవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రిన్స్‌పాల్స్ మెస్రం మనోహర్, ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి లక్ష్యంతో చదువుకోవాలని అందుకు ఇప్పటి నుండే ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. చెడు మార్గంలో వెళ్లవద్దని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. సాయిప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ నర్సింగ్‌రావు, లైబ్రేరియన్ చంద్రశేఖర్, అధ్యాపకులు అనిత, ముజీబ్, శ్రీకాంత్, తిరుపతి, నవీన్ పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో బుధవారం పశువైద్యాధికారి ఫర్వేజ్ అహ్మద్ లంపిస్కిన్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లంపిస్కిన్ వ్యాధి ద్వారా పశువులకు చర్మంపై దద్దుర్లు వచ్చి పశువులు అనారోగ్యంతో మృతి చెందుతాయన్నారు. వ్యాధి నివారణకు, ఆరోగ్యవంతమైన పశు సంపదకు లంపిస్కిన్ వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది మారుతి, జగన్నాథ్, పరమేశ్వర్, దుర్గాజీ, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

నేరడిగొండ: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు వడూర్ గ్రామంలో పర్యటించారు. మండల కేంద్రంలోని పాడుబడ్డ బావిని అధికారులు పూడ్చి వేయిస్తుండగా.. ఆ పనులను పరిశీలించారు. గ్రామాల్లో అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కొంత జాప్యం జరిగిందని, నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. తాగునీరు, పారిశుధ్యంపై ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజ్‌వీర్, పంచాయతీ కార్యదర్శులు నర్సారెడ్డి, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్ ఎంఈవోగా అనిత



బాధ్యతలు స్వీకరించిన అనిత

నార్నూర్: మండల ఎంఈవోగా జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పవార్ అనిత బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మండలంలో విద్యాఅభివృద్ధికి కోసం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ జాదవ్, చౌహాన్ హరిచంద్, రాథోడ్ రాజ్‌కుమార్, తిరుమల, రాథోడ్ అశ్విన్, రాథోడ్ జితేందర్ పాల్గొన్నారు.

బోథ్ ఎంఈవోగా ఈదపు పోశెట్టి

బోథ్: మండల విద్యాధికారిగా ఈదపు పోశెట్టి బుధవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇది వరకు నోడల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించిన ఆయనకు మండల విద్యాధికారి బాధ్యతలు అప్పజెప్పింది. ఇదివరకు ఇన్‌చార్జి ఎంఈవోగా పని చేసిన భూమారెడ్డి నేరడిగొండ ఎంఈవోగా నియమితులయ్యారు. కాగా మండలంలోని విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో అవర్లీ బేస్డ్ ప్రాతిపదికన పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో కామర్స్, పీజీటీ ఖాళీగా ఉందని, అభ్యర్థులు ఎంకామ్, బీఈడీ పూర్తి చేసిన వారు ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాల కోసం పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

అక్టోబర్ 1 వరకు వయోవృద్ధుల వారోత్సవాలు

ఆదిలాబాద్‌టౌన్: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 25 నుంచి అక్టోబర్ 1 వరకు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి సబితా తెలిపారు. బుధవారం వయోవృద్ధుల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బేల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో మహేందర్ కుమార్‌కు హేటిని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని హేటి, విష్ణుగూడ, తలాయిగూడ గ్రామస్తులు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని బాది గ్రామ పంచాయతీ నుంచి హేటి, విష్ణుగూడ, తలాయిగూడ గ్రామాలను తొలగించాలన్నారు. బాది గ్రామానికి ఎటువంటి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బండి సుదర్శన్, జోడే గణేష్, గంగారెడ్డి, రాందాస్, విష్ణుపాటిల్, కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ జయంతి



ఆదిలాబాద్: నివాళులర్పిస్తున్న బ్రహ్మానంద్



ఇంద్రవెల్లి: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్: దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహాత్యాగి పండిట్ దీన్ దయాళ్ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పండిట్ దీన్ దయాళ్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రధాన నరేంద్ర మోదీ ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నాంపెల్లి వేణుగోపాల్, లాలా మున్న, విజయ్, మయూర్ చంద్ర, వేదవ్యాస్, ముకుంద్, విజయ్, మయూర్ చంద్ర, ఆకుల ప్రవీణ్, క్రిష్ణ యాదవ్, జోగు రవి, సుభాష్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, మరప రాజు, రాథోడ్ భీంరావ్, ముండే సాయినందన్, రాథోడ్ రాధిక, దిలీప్ మోరే, మధుకర్, మస్కే రాజువర్ధన్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: పండిట్ దీన్ దయాళ్ జయంతిని బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కొండేరి రమేశ్, వెంకటేశ్, శేషరావు, చంద్రశేఖర్, కల్వ రవి, కైలాస్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

108, 102 వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

బోథ్: మండలంతో పాటు నేరడిగొండ, బజార్‌హత్నూర్ మండలాలకు చెందిన 108, 102, 1962 వాహనాలను బోథ్ మండల కేంద్రంలో బుధవారం క్వాలిటీ ఆడిటింగ్ అధికారి కిశోర్, ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు, పరికరాలను తనిఖీ చేశారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. 102 ప్రాజెక్టులో జిల్లా ఉత్తమ పైలట్‌గా స్వామి, మహేశ్‌లు అవార్డు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్, 1962 వాహనం వైద్యులు అవినాష్, రోజారాణి, ఫారుఖ్, సంతోష్, ప్రశాంత్, రమేశ్, సంతోష్, నవీన్, బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో, మహిళలు

బోథ్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మహిళలు భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్త్రీనిధి ఆర్ఎం పూర్ణచంద్ మాట్లాడుతూ.. మహిళలు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మాధవ, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

నేరడిగొండ: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం మండలంలోని నాగమల్యాల్, గోవింద్‌పూర్, పీచర, నేరడిగొండ గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గట్టు నారాయణ, తీగల నవీన్, గోడం అమృత్, జీవన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలల తనిఖీ



చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్

బేల: మండలంలోని గూడ గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం పోషణ్ చర్చలో భాగంగా బుధవారం అంగన్‌వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తహసీల్దార్ కొట్నాక రఘునాథ్ రావు తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. చిన్నారులతో కలిసి భోజనం చేసి, పోషకాహారం నాణ్యతపై ఆరా తీశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌రావు, ఆర్ఐ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన యువజన కాంగ్రెస్ నాయకుడు

కైలాస్‌నగర్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఘనంగా సత్కరించారు.

తహసీల్దార్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

ఇచ్చోడ: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇచ్చోడ తహసీల్దార్‌ను సీహెచ్ సత్యానారాయణ రావును బుధవారం బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, పాండురంగ్, రమేశ్, సాబీర్, మహేందర్‌రెడ్డి, అర్గుల గణేష్, మారుతి పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

తాంసి: తాంసి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌ను బుధవారం కళాశాల అధ్యాపకులు సన్మానించారు. అలాగే ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికైనా అధ్యాపకుడు శశికుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంఘం అధ్యక్షుడు గణేష్ కుమార్, సూర్యప్రకాష్, సంతోశ్, రమణారెడ్డి, తిరుపతి, దేవేందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి..

తాంసి: మండల పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనా తుల శ్రీనివాస్‌కు కప్పర్ల పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం పాఠశాలలో సన్మానించారు. నూతన కార్యవర్గ ఎన్నికైనా ఆయనను ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆనంద్, ఉపాధ్యాయులు కిష్టన్న, విలాస్‌గౌడ్, సంతోశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

బజార్‌హత్నూర్: మండలంలోని జాతర్ల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో గత ఎనిమిది సంవత్సరాలు విధులు నిర్వర్తించి, బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు గొడం చందన్, కోవ శంకర్, గోపాల్, గంగయ్య, రామారావ్, గోవింద్, గజానంద్, నాగోరావ్, ఉత్తం, వంశి, బాజీరావ్‌లను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిషన్‌రెడ్డి, భూమన్న, దేవరావ్, సురేందర్, అనిత, శ్రీలత, శ్రీధర్, సంతోష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంటి వైద్య శిబిరానికి స్పందన

బోథ్: మండల కేంద్రంలోని మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులతో పాటు చాలా మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. పలువురికి కళ్లద్దాలు అవసరమవగా, సొసైటీ ద్వారా అందజేస్తామని అనిల్ తెలిపారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ కోఆర్డినేటర్ వెంకట రమణ, టెక్నీషియన్ గజానంద్, కృష్ణ, అమిత్, ఆనంద్, నవీన్, ఓస సాయి, అరవింద్, రాకేశ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

'గమ్యం' యాప్‌పై అవగాహన

ఇంద్రవెల్లి: రోడ్డు భద్రత, గమ్యం యాప్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఆర్టీసీ ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పించారు. టికెట్ రిజర్వేషన్, బస్సు సమయం, ఎక్కడ ఉన్నది కూడా చూడవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ విలేజ్ బస్ ఆఫీసర్ సతీష్, ఇంద్రవెల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐలమ్మ జయంతి

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఎదుట ఐలమ్మ విగ్రహం వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పట్టణ అధ్యక్షుడు సంతోష్ పిలుపు నిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. పట్టణ ప్రజలు, బీసీ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. నాయకులు వినోద్, అఖిల్, నవీన్, సుభాష్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

తాంసి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంపీడీవో మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి హెచ్‌ఎం శ్రీకాంత్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం తెలుసుకొని, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వారి వెంట ఎంపీవో లింగయ్య, కార్యదర్శి గంగయ్య, ఉపాధ్యాయులు ఉమా మహేశ్వర్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

రేపు ప్రాథమిక సహకార సంఘం సమావేశం

నేరడిగొండ: ప్రాథమిక సహకార సంఘం సర్వ సభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు సాబ్లె కిషోర్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు పీఏసీఎస్ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి ప్రాథమిక సహకార సంఘం సభ్యులు, రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

నార్నూర్: పారిశుధ్యం, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జవహర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాటిన మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేసి, వాటి సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీవో స్వప్నశీల, ఏపీవో సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

కైలాస్‌నగర్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు బుధవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎంప్లాయీస్-వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) జిల్లా అధ్యక్షుడు దర్శనాల నగేశ్ మాట్లాడుతూ, కార్మికులకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘం నాయకులు ఆత్మారాం, జనార్దన్, అజీమ్, శివప్రసాద్, గంగన్న, భూమన్న, శ్యామ్ పాల్గొన్నారు.

ఫార్మసిస్ట్ చట్టాలు అమలయ్యేలా చూడాలి

నేరడిగొండ: ఫార్మసిస్ట్ చట్టాలను అమలయ్యేలా చూడాలని ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. సెప్టెంబర్ 25 ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలతను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాతో సత్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ ఫార్మసిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డి.కపిల్ కుమార్, జిల్లా కోశాధికారి మనోజ్, మండల అధ్యక్షుడు ఇసాఖొద్దీన్, ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.